సాక్షి నిజామాబాద్

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



ఆహార శాస్త్రంతో ఉపాధి

ఆహారరంగంలో సాంకేతిక విద్యనభ్యసించడం ద్వారా విద్యార్థులకు ఉపాధితో పాటు ఉద్యోగావకాశాలు కూడా మెరుగవ్వనున్నాయి.

- 10లో ▸



జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ

భారత జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 18న బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు అవంతిరావు తెలిపారు.

- 11లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 34.5 /22.3

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి చల్లటి గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యేలు



వేల్పూర్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మరణించగా ఆయనను ఆదిలాబాద్, జగిత్యాల, ముథోల్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, డాక్టర్ సంజయ్, విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టూరిజం ఎండీ మనోహర్, వరంగల్ ఎలక్ట్రిసిటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి శనివారం వేల్పూర్ మండల కేంద్రంలో పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మంత్రి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ



నిజామాబాద్ సిటీ : తీరొక్క పూలతో, రకరకాల పిండి వంటలతో గౌరీదేవిని ఆహ్వానిస్తూ పూజించటం మన సంస్కృతి. మన సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ. జిల్లాలో శనివారం ఆడపడుచులందరూ ఒక్కచోట చేరి, ప్రకృతిలో లభించే రకరకాల పూలతో కొన్ని వరుసలు పేర్చి మధ్యలో పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ ఆడి పాడారు. అనంతరం వాటిని దగ్గర్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలలో మహిళలు ఎంగిలిపూల బతుకమ్మను ఘనంగా జరుపుకున్నారు.

పరుగు ఆపని వీరుడు

- జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన సయ్యద్ ఖైసర్
- స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు
- యువతకు ఉచిత శిక్షణ
- 300 మందికి పైగా యువతకు ఉద్యోగ సాధనలో తోడ్పాటు
- వచ్చేనెలలో జిల్లాలో స్పోర్ట్స్ మీట్

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అథ్లెటిక్స్‌లో ఆలిండియా స్థాయిలో బంగారు పతకాలు సాధించి, మంచి ట్రాక్ రికార్డు కలిగిన జిల్లాకు చెందిన సయ్యద్ ఖైసర్ యువతను తనకన్నా మరింత ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు శక్తికి మించి కృషి చేస్తున్నారు. 1992లో తన స్పోర్ట్స్ కెరీర్ ప్రారంభించిన ఖైసర్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అప్పటి ఉమ్మడి రాష్ట్రానికి ఖ్యాతి ఆర్జించిపెట్టారు. బీకాం డిగ్రీతో పాటు ఓయూలో ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫార్మసీలో డిప్లొమా కోర్సులు చేసిన ఖైసర్ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు తనవంతుగా పాటుపడుతున్నారు. ఇందుకోసం 2006లో జిల్లాలో ఖైసర్ స్పోర్ట్స్ అకాడమీని నెలకొల్పారు. దీని ద్వారా యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. తన తర్ఫీదుతో ఇప్పటివరకు 300 మందికి పైగా యువతకు భారత ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, స్టేట్ పోలీస్ తదితర పారామిలటరీ బలగాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. ఉద్యోగాలు సాధించిన ఖైసర్ శిష్యుల్లో పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత ఉన్నారు.



ఖైసర్‌ను సన్మానిస్తున్న నగర ప్రముఖులు



ఖైసర్ శిష్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పోలీసు



శిక్షణ ఇస్తున్న ఖైసర్

సాధించిన విజయాలివే..

- 1992లో సయ్యద్ ఖైసర్ స్పోర్ట్స్ కెరీర్ ప్రారంభించారు. 200, 400 మీటర్ల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి స్టేట్ మీట్‌కు ఎంపిక
- 1993లో స్టేట్ స్కూల్ గేమ్స్‌లో 200, 400 మీటర్ల అథ్లెటిక్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్‌తో బెస్ట్ అథ్లెటిక్స్ అవార్డు
- 1994లో ఏపీ స్పోర్ట్స్ అథారిటీకి ఎంపిక.
- 1994–95 హరియాణాలోని రోహతక్‌లో జరిగిన ఇండియన్ స్కూల్ గేమ్స్‌లో కాంస్య పతకం
- 1995లో కాకినాడలో జరిగిన ఆలిండియా ఇంటర్ జోనల్స్ మీట్ 400 మీటర్ల విభాగంలో గోల్డ్‌మెడల్
- 1994–95 సౌతిండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌లో రెండు వెండి మెడల్స్‌తో ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ మీట్‌కు ఎంపిక
- 1995లో చెన్నై, బెంగళూరులో జరిగిన ఇండియన్ నేషనల్ అథ్లెటిక్స్ క్యాంప్‌కు ఎంపిక
- 1995–96 హైదరాబాద్‌లోని ఇండియన్ మెయిన్ హాస్టల్ స్పోర్ట్స్ అథారిటీకి ఎంపిక
- 1995–96లో బెస్ట్ జూ.అథ్లెట్‌గా అవార్డు
- 1995–96లో ఓయూ చరిత్రలో మూడు బంగారు, రెండు వెండి పతకాలు సాధించి ఉత్తమ అథ్లెట్‌గా అవార్డులు
- 1996–97లో ఓయూలో 800 మీటర్ల పోటీలో రికార్డు సాధించి యూనివర్సిటీ బెస్ట్ అథ్లెట్‌గా అవార్డు
- 1996–97లో ఇండియన్ ఇంటర్ యూనివర్సిటీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌కు చీఫ్ కెప్టెన్‌గా వ్యవహరించారు
- 1997–98లో బెస్ట్ సీనియర్ అథ్లెట్ ఆఫ్ ఇయర్‌గా అవార్డు
- 1998–99లో నెల్లూరులో జరిగిన సీఎం కప్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్
- 2000–2021లో డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత. అంతకు ముందు పీఈసెట్‌లో 6వ ర్యాంక్

“ ఓపికున్నంత వరకు శిక్షణనిస్తా



యువతకు శిక్షణనిస్తూ వారికి ఉన్నతికి పాటు పడుతుంటా. ఎల్లవేళలా మైదానంలో క్రీడాకారులకు అందుబాటులో ఉంటా. ఓపికున్నంత వరకు కష్టపడ్తాను.

– ఖైసర్

స్పెషలిస్ట్ అథ్లెట్‌గా గుర్తింపు..

400 మీటర్లు, 800య మీటర్లు విభాగాల్లో స్పెషలిస్ట్ అథ్లెట్‌గా ఉన్న ఖైసర్ స్ప్రింట్, మిడిల్ డిస్టెన్స్ రన్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో ద్రోణాచార్య, అడిడాస్ గోల్డెన్ షూస్ అవార్డు గ్రహీత మహ్మద్ ఇలియాస్ బాబర్ స్మారక రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను 13వ సారి నిజామాబాద్‌లో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రాహుల్ పాదయాత్ర

- 19న లేదా దసరాలోపు పర్యటించే అవకాశం
- ఢిల్లీ నుంచి ఏఐసీసీ బృందం పరిశీలన



ఖలీల్‌వాడి : ఉమ్మడి జిల్లాలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ రాహుల్‌గాంధీ పర్యటనకు రంగం సిద్ధమైంది. ఈనెల 18, 19 తేదీల్లో తెలంగాణలో ఆయన పర్యటన దాదాపుగా ఖరారైంది. 18న జగిత్యాల జిల్లాలోని కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనుంది. కొండగట్టు ఆంజనేయస్వామికి పూజలు చేసిన అనంతరం జగిత్యాల జిల్లా పర్యటన చేసిన తర్వాత 18 రాత్రి నిజామాబాద్‌కు చేరుకుంటారు. రాత్రి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన తర్వాత 19న ఉదయం నగరంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పీసీసీ వర్గాల ద్వారా తెలిసింది. మధ్యాహ్నం కామారెడ్డిలో పాదయాత్ర చేసిన అనంతరం హైదరాబాద్ వెళ్తారు. రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఏఐసీసీ బృందం రెండు రోజుల క్రితం పర్యటించింది. రాహుల్ బసచేసే ఓ ప్రైవేట్ హోటల్‌తో పాటు నిజామాబాద్, కామారెడ్డిలోని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేసే ప్రాంతాలను పరిశీలించారు. అయితే 19న రాహుల్‌గాంధీకి ఢిల్లీలో జాతీయ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉండటంతో పర్యటనపై సందిగ్ధత నెలకొంది. అక్కడ ఆయన సమావేశంలో పాల్గొంటే మాత్రం దసరాలోపు ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రేపు కాంగ్రెస్ టికెట్ల ప్రకటన..?

ఈనెల 16న కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల ప్రకటన వెలువడనుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

వస్తూనే విధుల్లోకి..

- ఎన్నికలపై సీపీ కల్మేశ్వర్ ఫోకస్
- సర్కిల్ స్థాయిలో సమాచారం సేకరణ
- పోలీసు అధికారుల్లో ఉత్కంఠ



ఖలీల్‌వాడి : ఎన్నికల కోసం సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఫోకస్ పెట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి 10:30 గంటలకు సీపీగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు తీసుకున్న సీపీ ఉదయమే నగరంలోని పోలీసు అధికారులతో సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సమావేశాలు నిర్వహించారు. సర్కిల్ పరిధిలో ఉన్న సీఐ, ఎస్సైల ప్రత్యేకంగా మాట్లాడి స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్ తోపాటు లా అండ్ ఆర్డర్ పరిస్థితిపై ప్రత్యేకంగా చర్చించారు. ఒక సర్కిల్ పరిధిలో సమావేశం నిర్వహించిన సమయంలో సీఐలు, ఎస్సైలు కలిసేందుకు వచ్చినప్పటికీ వారిని అనుమతించలేదు. నగరంలోని మూడు సర్కిళ్లకు సంబంధించిన సీఐలు, ఎస్సైలతో చర్చించారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలు సేకరించారు. గతంలో ఏఏ ప్రాంతాల్లో సంఘటనలు జరిగాయనే విషయాలను తెలుసుకున్నారు. సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ సర్కిల్ పరిధిలో వివరాలను నేరుగా ప్రశ్నించడంతో పోలీసులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. గతంలో అధికారి సీపీగా బాధ్యతలు స్వీకరించగానే పలువురు వెళ్లి కలిసేవారు. కాని శనివారం సీపీ ఆఫీస్ వద్ద పోలీసు అధికారులు మాత్రమే కనిపించారు.



శనివారం పితృ అమావాస్య సందర్భంగా ఎడపల్లి మండలంలోని జానకంపేట లక్ష్మీనృసింహ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అష్టముఖి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. - ఎడపల్లి

పోచారం కుటుంబానికి ఇసుక ముడుపులు



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

- రోజుకు రూ.10లక్షలు అందుతాయి
- ఆరోపణలపై వెంకటేశ్వర స్వామి పాదాల వద్ద ప్రమాణానికి సిద్ధం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ సవాల్
- ధాన్యం టెండర్లలోనూ మిల్లర్ల సిండికేట్

సుభాష్‌నగర్ : స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి ప్రతిరోజు రూ. 10 లక్షలు ముడుపులు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి పాదాల వద్ద ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, కాదు అంటే అక్కడికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైస్‌మిల్లుల్లో ఉన్న మూడు సీజన్లకు సంబంధించిన సుమారు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం విక్రయించేందుకు మొదటి విడతలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి టెండర్లను ఆహ్వానించారన్నారు. టెండర్లలో రైస్‌మిల్లర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. గన్నీబ్యాగులు, రవాణా, కేంద్రాల కమీషన్, తదితర ఖర్చులతో ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2,313 వెచ్చించి కొనుగోలు చేసిందని, దీనికి తోడు రూ. 340 కస్టోడియన్ ఫీజు కూడా చెల్లించిందన్నారు. మొత్తం రూ.2,653 ప్రభుత్వానికి ఖర్చయ్యిందని, కానీ టెండర్లలో కేవలం రూ. 1,732 (అత్యధిక ధర) బిడ్డింగ్ వేసినట్లు లెక్కలు చూపుతున్నారన్నారు. దీనిపై విమర్శలు రావడంతో రీటెండర్ల ఆహ్వానించారని, ఈనెల 25న బిడ్డింగ్ ఓపెన్ చేస్తారన్నారు. అందులో కూడా రైస్‌మిల్లర్లు కుమ్మక్కై కేవలం రూ. 1,800లకు మించి కోడ్ చేయవద్దని సిండికేట్ అయ్యారని ఆరోపించారు. అంతేగాకుండా రైస్‌మిల్లుల్లో 50శాతం కూడా లేని ధాన్యానికి టెండర్లు వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే షకీల్, స్పీకర్ పోచారం ఫ్యామిలీ బినామీల పేరుతో రైస్‌మిల్లులు ఏర్పాటు చేసి మిల్లర్లుగా అవతారం ఎత్తారన్నారు. లోతుగా దర్యాప్తు చేయాలన్నారు. సమావేశంలో స్వామి యాదవ్, నారాయణ యాదవ్ ఉన్నారు.

ఆయుధాలపై ఆంక్షలు

- జిల్లాలో 75 లైసెన్స్‌డ్ గన్‌లు
- అప్పగించాలంటున్న పోలీసులు
- ఈనెల 9 వరకు 35 డిపాజిట్



ఖలీల్‌వాడి : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తుపాకీపై ఆంక్షలు విధించారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న ఆయుధాలు పోలీసులకు అప్పగించాల్సిన పరిస్థితి. తుపాకీ లైసెన్స్‌ను రాజకీయనాయకులు, అసాంఘిక శక్తుల నుంచి ప్రాణ రక్షణ కోసం, ఎక్కువగా డబ్బులు లావాదేవీలు చేసేవారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బంగారు వ్యాపారులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు భద్రత కోసం తీసుకుంటారు. తమకు తుపాకీ అవసరంపై పోలీస్ కమిషనర్‌కు వివరిస్తూ దరఖాస్తు చేసుకుంటారు. పోలీసులు విచారణ చేసిన తర్వాత అత్యవసరమైతే సీపీ సదరు వ్యక్తికి తుపాకీ లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. ఈ లైసెన్స్‌ను ఆధారంగా లైసెన్స్‌దారులు తుపాకీని కొనుగోలు చేస్తారు. ఎన్నికల సందర్భంగా తుపాకీ లైసెన్స్‌దారులు గొడవలకు దిగే అవకాశం ఉండటంతోపాటు ఓటర్లను, తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతో తుపాకీ లైసెన్స్ కలిగిన వారి తుపాకీలను పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. లైసెన్స్‌దారుల నుంచి తీసుకున్న తుపాకీలను పోలీసులు ఎన్నికల రిజల్ట్ వచ్చేవరకు వారి వద్దే ఉంచుకుంటారు. కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో గన్స్ కలిగిన వారు నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే కొందరు పోలీస్‌స్టేషన్‌లో తమకు ఉన్న ఆయుధాలను అప్పగించి రసీదులను తీసుకుంటున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 75 తుపాకీ లైసెన్స్‌లు ఉన్నట్లు పోలీసువర్గాలు తెలిపారు. ఈనెల 9 వరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 35 తుపాకీలను అప్పగించినట్లు సమాచారం. జిల్లాలో ఉన్న 75 తుపాకీ లైసెన్స్‌లలో కొన్ని బ్యాంకులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. బ్యాంక్‌లలో ఉన్న తుపాకులు పోను మిగతా తుపాకీలను ఆయా పోలీస్‌స్టేషన్లలో స్వాధీనం చేసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఉన్న సమయంలో కొంత మంది రాజకీయ నాయకులు తుపాకీ లైసెన్స్‌లు పొందారు. 2015లో మానాల ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టడంతో లైసెన్స్‌లను పోలీసులు అప్పట్లో తిరిగి తీసుకున్నట్లు తెలుస్తోంది.

రౌడీషీటర్ల బైండోవర్..

జిల్లాలో 200 మందిపై రౌడీషీటర్లు ఉన్నాయి. కొంతమంది పోలీసులు పీడీయాక్ట్‌ను అమలు చేశారు. పోలీసులు రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత రౌడీ షీటర్లను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. రౌడీషీటర్ల ఇళ్లను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు.

అంతేకాకుండా వారు చేస్తున్న పనులపై నిఘా పెడుతున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసు కుంటున్నారు. జిల్లా కేంద్రంలోనే రౌడీషీటర్లు ఎక్కువ మంది ఉండటంతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

స్థానిక పీఎస్‌లలో అప్పగించాలి

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డ నేపథ్యంలో జిల్లా సీపీ పరిధిలోని ఆర్మ్ లైసెన్స్ పొందిన వారు సెక్షన్ 21 ఆఫ్ ఆర్మ్ యాక్టు 1959 ప్రకారం ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆయుధాలను ఈనెల 21లోపు డిపాజిట్ చేయాలని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. డిపాజిట్ చేయకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు పొందాలనుకుంటే జిల్లా ఆర్మ్ స్క్రీనింగ్ కమిటీ, సీపీ కార్యాలయంలోని అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్ జయరామ్‌కి రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

‘గృహలక్ష్మి’కి బ్రేక్..

- ఎన్నికల కోడ్ అమలుతో ప్రస్తుతానికి ఆగినట్లే..
- ఇప్పటికే భారీ మొత్తంలో దరఖాస్తుల స్వీకరణ
- మంజూరు పత్రాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం
- దరఖాస్తుదారులకు చేరని సాయం



మోర్తాడ్(బాల్కొండ): సొంతగా జాగా ఉండి ఇళ్లు నిర్మించుకోవాలని అనుకున్నవారికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షల సాయాన్ని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కాని పథకం అమలులో జాప్యం చేయడంతో ఎంతో మంది అర్హులకు ఇప్పట్లో లబ్ధిచేకూరే అవకాశం కనిపించడం లేదు. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో కోడ్ అమలులోకి వచ్చింది. ఫలితంగా గృహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందాలనుకునే వారికి ఇంకా ఎదురు చూపులు తప్పడం లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌లో గృహలక్ష్మి పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షల చొప్పున సాయం అందించడానికి రూ. 7,350 కోట్ల నిధులను కేటాయించారు. గడిచిన రెండు నెలల కిందనే దరఖాస్తులను స్వీకరించగా జిల్లాలో ఈ పథకం కింద లబ్ధి పొందడానికి 25 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గానికి తొలి విడతలో 3 వేల మందికి సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాలకు కలిపి 14,500ల ఇళ్ల నిర్మాణానికి సాయం అందించడానికి అవకాశం ఉందని అధికారులు తేల్చారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందించి ఉంటే ఇంటి నిర్మాణం జరిగిన కొద్ది సాయం దశల వారిగా ఖాతాల్లో జమయ్యేది. లబ్ధిదారుల ఎంపికలో జాప్యం చేయడం, మంజూరు పత్రాలను అందించకపోవడంతో ఎవరికి కూడా తొలి విడతలో ఇళ్ల నిర్మాణానికి సాయం అందించే పరిస్థితి కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, అంతలోనే పంచాయతీ ఎన్నికలకు నగారా మోగే అవకాశం ఉండటంతో గృహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందడం ఇప్పట్లో సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదనే వాదన వినిపిస్తుంది.

“ కావాలనే జాప్యం చేశారు



గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేయడం, మంజూరు పత్రాలు ఇవ్వకపోవడం అంతా ఒక డ్రామా. పథకాన్ని అమలు చేయడం ఇష్టం లేకనే జాప్యం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని ఇప్పుడు ప్రచారం చేసుకునేందుకు అవకాశం దొరికింది.

– ఆదెపు సవిత, ఎంపీటీసీ సభ్యురాలు, తాళ్లరాంపూర్

చిత్తశుద్ధి లేదు..



పథకం అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందువల్లే గృహలక్ష్మి పథకం గురించి గొప్పగా ప్రచారం చేశారు తప్ప ఆచరణలో పక్కాగా అమలు చేయలేదు. నిధులు కేటాయించి నెలలు గడచినా లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడం, మంజూరు పత్రాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది.

– జక్కం అశోక్, మోర్తాడ్

క్లుప్తంగా

పేకాటస్థావరంపై దాడి

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. దాడిలో రూ.5,350 నగదు, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారమివ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

మాణిక్‌బండార్‌లో..

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులో ఉన్న ఓ గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. దాడిలో రూ.6,50,400 నగదు, పది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డి : పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై గణేష్ శనివారం తెలిపారు. కామారెడ్డికి చెందిన రమేష్ రెండు నెలల క్రితం ఎల్లారెడ్డిలో ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆయన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయడంతో ఫోన్‌ను కామారెడ్డిలో ఉన్నట్లు గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

ఆహార శాస్త్రంతో ఉపాధి



రుద్రూర్ ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల

- రాష్ట్రంలో ఏకైక ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాల
- 16 వరకు ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అవకాశం

రుద్రూర్: ఆహార రంగంలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ (ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన)కళాశాలను 2015లో రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో ఏర్పాటు చేసింది. దీని ద్వారా విద్యార్థులకు ఉపాధితో పాటు ఉద్యోగావకాశాలు మెరుగవ్వనున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ కళాశాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ న్యూఢిల్లీ వారి ఏ గ్రేడ్ గుర్తింపు ఉంది. ఇక్కడ నాలుగేళ్ల బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సు అందుబాటులో ఉంది. విద్యార్థులు మొదటి మూడేళ్లు ఫుడ్ కెమిస్ట్రీ, ఫుడ్ మైక్రోబయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో విద్యనభ్యసిస్తారు.

నాలుగో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 'ఎక్స్‌పెరియన్షియల్ లెర్నింగ్ పోగ్రామ్ (ఈఎల్‌పీ)లో పాల్గొని స్వయంగా ఆహార ఉత్పత్తిని చేసి మార్కెటింగ్ చేస్తారు. తద్వారా పరిశ్రమను స్థాపించే స్థాయికి ఎదుగుతారు. రెండో సెమిస్టర్‌లో ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో క్షేత్ర స్థాయి శిక్షణను తీసుకొని ప్రాజెక్ట్ వర్క్ కోర్స్ ద్వారా వినూత్నమైన ఆహార ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సాంకేతికతను అందిపుచ్చుకుంటారు. అంతేకాకుండా ఈ కోర్సు పాఠ్యాంశాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మెరుగైన భవిష్యత్ కోసం కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు సిద్ధం చేస్తాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్

వివిధ రకాల యంత్రాలతో అత్యున్నతమైన సాంకేతిక విద్యను అందిస్తుంది. కోర్సు ముగిసే సమయానికి విద్యార్థులకు వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలపై అనుభవం ఉంటుంది. రైతులు, పరిశ్రమల సిబ్బంది నైపుణ్యాభివద్ధిని పెంపొందించడానికి సహాయపడే ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ విభాగంలక్ష్యం.

కోర్సులో ఆరు డిపార్ట్‌మెంట్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ కళాశాలలోని ప్రధాన విభాగం. ఆహార పదార్థాల ప్రాసెసింగ్, సంరక్షణలో విద్యార్థులకు లెర్నింగ్ అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విభాగం ఫుడ్ ప్రాసెసింగ్ ఆవశ్యకతను, ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించే పద్ధతులను వివరిస్తుంది. వినియోగదారులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు హ్యాండ్లింగ్, నాణ్యత నియంత్రణ విభిన్న అంశాలను అర్థం చేసుకోవడం ఈ కోర్సు లక్ష్యం.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్

ఈ విభాగం విద్యార్థులకు ఫుడ్ ప్లాంట్, ఎక్విప్‌మెంట్ డిజైన్, ప్రాసెస్ కంట్రోల్, ప్యాకేజింగ్, ఆహార పదార్థాల నిలువకు సంబంధించిన టెక్నాలజీల ఇన్‌స్ట్రుమెంటేషన్ విద్యను అందిస్తుంది. ఇది ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలకు, ఇంజనీరింగ్ సూత్రాలను వర్తింపజేయడానికి శిక్షణ ఇస్తుంది. ఆహార ఉత్పత్తిలో నాణ్యతను మెరుగుపర్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

ఆహార వ్యాపార నిర్వహణ..

ఆహార చట్టాలు, మార్కెటింగ్ వ్యవహారాలపై శిక్షణ ఉంటుంది. ఇది అధిక నాణ్యతతో నడిచే పరిశ్రమల్లో విద్యార్థులను మరింత ప్రభావితం చేసి వారిని ప్రతిభావంతమైన ప్రొఫెషనల్స్‌గా తయారు చేస్తుంది. సంస్థను స్థాపించడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది.

స్టూడెంట్ రెడీ

స్టూడెంట్ రెడీ (గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివద్ధి యోజన) ప్రోగ్రాం అనేది వ్యవసాయం, అనుబంధ సబ్జెక్టుల గ్రాడ్యుయేట్లకు ఉపాధిని నిర్ధారించడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ చొరవ చూపుతుంది. కార్యక్రమంతో విద్యార్థులు ఎక్స్‌పెరియన్షియల్ లెర్నింగ్ పోగ్రామ్ ఇన్-ప్లాంట్ శిక్షణ పొందుతారు. ఈ విద్యార్థులు తమ సొంత సంస్థను ప్రారంభించడానికి సహాయపడుతుంది.

ఆహార భద్రత, నాణ్యత విభాగం

ఆహార రసాయన శాస్త్రం, మైక్రోబయాలజీకి ఆహార పరిశ్రమలో ప్రధాన ప్రాముఖ్యత ఉంది. ఇందులో రసాయన ప్రతిచర్యలు, సూక్ష్మజీవులు, జీవసంబంధమైన, జీవేతర ఆహార భాగాల్లో వాటి పరస్పర చర్య ప్రక్రియల అధ్యయనం ఉంటుంది. ప్రాసెసింగ్, నిల్వ సమయంలో ఆహారంలో మార్పులతో వ్యవహరిస్తారు. ఆహార పరిశ్రమలో ఇది చాలా ముఖ్యమైనది. ఆహార ప్రాసెసింగ్ రంగం మొత్తం అభివద్ధికి గ్లోబల్ మార్కెట్‌లో నాణ్యత, ఆహార భద్రతకు పోటీగా మారాయి. ఈ విభాగం విద్యార్థులకు నాణ్యత నియంత్రణ, నాణ్యత హామీ, భద్రత, నిర్వహణకు సంబంధించిన నైపుణ్యాలను బలోపేతం చేసేందుకు సహకరిస్తాయి.

ఉపాధి, ఉద్యోగావకాశాలు

ఈ కోర్సు చదివిన విద్యార్థులకు అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు ఉంటాయి. అత్యధిక ప్రాధాన్యత కలిగిన ఆహార రంగంలో పరిశ్రమలు స్థాపించడానికి ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంలో పరిశ్రమలు స్థాపించడానికి ఎన్నో ప్రోత్సాహక పథకాలు ప్రకటిస్తున్నాయి. ఈ కళాశాలలో పట్టభద్రులైన 158 మందిలో, 18% మంది ఉన్నత విద్య ఇతర దేశాలకు వెళ్లారు. 58% కంటే ఎక్కువ మంది జాతీయ, బహుళజాతి ప్రైవేట్ సంస్థల్లో ఏడాదికి రూ.8 లక్షల కంటే ఎక్కువ ప్యాకేజీని పొందుతున్నారు.

16న స్పాట్ అడ్మిషన్

టీఎస్ ఎంసెట్ ర్యాంకుతో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా, మెరిట్ ఆధారంగా రైతు కోటాలో 40శాతం లోపు ప్రవేశం కల్పిస్తారు. 2023–24 సంవత్సరానికి నేరుగా ఇంటర్‌లో ఎంపీసీ చదివిన వారికి కూడా ఈ కోర్సులో చేరే అవకాశం కల్పించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ కల్పన వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో ఈనెల 16న స్పాట్ అడ్మిషన్ జరగనుంది.

ఆటోలో బాలిక కిడ్నాప్



అక్షర

ఖలీల్‌వాడి: బజ్జీలు కొనిస్తానని బాలికను ఓ ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన అక్షరను ఆటో డ్రైవర్ బజ్జీలు కొనిస్తానని ఆటోలో నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి)కి వచ్చిన తర్వాత బాలిక అక్షర ఏడ్వడంతో స్థానికులు ఆటో ఆపి ఆరా తీశారు. అక్షరను స్థానికులు వివరాలు అడుగగా తల్లి పేరు కవిత, తండ్రి దిగంబర్, సర్పంచ్ రాములు అని చెప్పింది. బజ్జీలు కొనిచ్చి విడిచిపెడతానని చెబితే వచ్చానని, ఇతను ఎవరు మీ తాతాన అని స్థానికులు ప్రశ్నించగా కాదు ఆటో డ్రైవర్ అని అక్షర సమాధానం ఇచ్చింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్షర తల్లిదండ్రులకు సమాచారం అందించామని బాలికను కుటుంబసభ్యులకు అప్పగిస్తామని స్థానికులు చెప్పారు.

బేస్‌బాల్ రీజినల్ టోర్నీలో జిల్లా జట్టు విజయం



విజేతగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: బేస్‌బాల్ హైదరాబాద్ రీజినల్ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో హైదరాబాద్ రీజినల్ లెవెల్(తెలంగాణ-ఆంధ్రప్రదేశ్), ఎంఎల్‌బీ (బేస్ బాల్)కప్ పోటీలు జరిగాయి. ఇందులో తెలంగాణ స్ట్రైకర్స్ జట్టులో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రథమ స్థానం సాధించారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయిలో నిర్వహించే 42వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ శనివారం తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులు పండరి, సాయినాథ్, అక్షయ్, సన్నిధి, రుచితను ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, రమణ, ఎన్వీ హనుమంత్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, కిషన్, నర్సయ్య, రాజేశ్వర్, కృష్ణమూర్తి, సురేందర్, నాగేశ్, వినోద్, సాయిబాబా, మాధురి, భాగ్యశ్రీ, స్వప్న, పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు..



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

డిచ్‌పల్లి: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన హైదరాబాద్ రీజినల్ లెవల్ (తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్) ఎంఎల్బీ బేస్ బాల్ కప్ పోటీల్లో తెలంగాణ స్ట్రైకర్స్ జట్టు విజయం సాధించింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి ఉన్నత పాఠశాల క్రీడాకారులు కె.కిశోర్, ఈ.శ్రీశాంత్ తెలంగాణ స్ట్రైకర్స్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఎంఎల్ బీ కప్ ఇండియా ఇన్‌చార్జి డేవిడ్ (అమెరికా) చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ స్థాయి ఎంఎల్ బీ పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం క్రీడాకారులను హెచ్ఎం సుశీల్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోటెత్తిన భక్తజనం



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి

ఎడపల్లి: మండలంలోని జానకంపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పితృ అమావాస్యను పురస్కరించుకొని అష్టముఖి కోనేరులో భక్తులు స్నానమాచరించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధ గాంచిన ఈ అష్టముకి కోనేరులో స్నానాలు ఆచరించడానికి మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు



కోనేరు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

క్రైం కార్నర్

గుండెపోటుతో బాలిక మృతి



మైథిలీ (ఫైల్)

మోపాల్: కంజర్ గ్రామానికిచెందిన మైథిలీ (12) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైథిలీ కంజర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన మైథిలీ రాత్రి ఇంట్లో భోజనం చేశాక ఛాతిలో నొప్పి వస్తుందని తల్లి సాయిలక్ష్మికి తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాము కాటుతో యువకుడు..

రుద్రూర్: సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్(31) పాము కాటుతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో గేదెలను మేత కోసం తీసుకెళ్లగా అక్కడ పాము కాటు వేసిందని ఫయాజ్ గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో రాథోడ్ మోహన్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆవులను మేత కోసం గ్రామ శివారుకు తీసుకెళ్తుండగా ప్రాథమిక పాఠశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నష్టపరిహారం కోసం పైఅధికారులకు నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దుబ్బ ప్రాంతానికి చెందిన అశోక్ తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి సిద్దిపేట్‌కు వెళ్లారు. దుండగులు రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించిన స్థానికులు అశోక్‌కు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నగదు పట్టివేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. రెండు లక్షలు, 14.80 తులాల బంగారం, మరొకరి నుంచి రూ. 7లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు. పట్టుకున్న నగదు, బంగారాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

చదువు ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: చదువు ఇష్టం లేక రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి సమీపంలోని రంగంపేట రైల్వే గేటు వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం గోకుల్ తండాకు చెందిన బాదావత్ అనిల్ (19) రామారెడ్డిలో ఇంటర్ వరకు చదివాడు. ఇటీవల బీఫార్మసీ చదవడానికి అతని తల్లిదండ్రులు ఖమ్మంలోని కళాశాలలో చేర్పించారు. ఈనెల 6న ఖమ్మం వెళ్లిన అతడు ఇంటికి తిరిగి వస్తానని చెప్పి13న రైలులో బయలుదేరాడు. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో శనివారం దిగిన అతడు ఆటోలో రంగంపేట వరకు చేరుకొని గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై తావునాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో మండల కేంద్రానికి చెందిన పిరాయి కృష్ణ (38) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ శనివారం తెలిపారు. ఇంట్లో జరిగిన గొడవలు, కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి తండ్రి బల్వంత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఇందల్వాయి: మండలంలోని పాత నేరస్తులను ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే వరకు అన్ని రకాల భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతి భద్రతల అదుపులో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని ఎస్సై కోరారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీవో అలివేలు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో గల తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో జోనల్ స్థాయి క్రీడలు రసవత్తరంగా సాగుతున్నాయి. పోటీలను శనివారం ఉమ్మడి జిల్లాల ఆర్‌సీవో అలివేలు సందర్శించారు. 3వ జోన్‌లోని కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సుమారు 1275మంది క్రీడాకారులు స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొంటున్నారని, పోటీలు ఈనెల 16న ముగుస్తాయన్నారు. డీసీవో కృతామూర్తి ఆధ్వర్యంలో క్రీడాకారులు, హాజరైన పీఈటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మకుమారి తెలిపారు.





పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బెల్ట్‌షాపుపై దాడి



నిజాంసాగర్: మల్లూర్ గ్రామంలోని బెల్ట్‌షాపుపై ఎస్సై రాజశేఖర్ శనివారం రాత్రి దాడి చేశారు. గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న సురేశ్‌ను అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెట్‌పల్లిలో..

మాక్లూర్: మండలంలోని మెట్‌పల్లిలో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి రూ. నాలుగు వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో ఏఆర్ కానిస్టేబుల్ అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఏఆర్ కానిస్టేబుల్ కనికరం నటరాజ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన నటరాజ్ కొన్ని సంవత్సరాలుగా వివాహం చేసుకుంటానని నమ్మిస్తూ సన్నిహితంగా ఉంటున్నాడు. కాగా నటరాజ్ మరో యువతితో వివాహం చేసుకోడానికి సిద్ధమవుతున్నట్లు వివాహిత తెలుసుకుని సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీంతో సీపీ ఆర్మూర్ పోలీసులను విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ చేపట్టిన పోలీసులు నటరాజ్‌పై అత్యాచార కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.